ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూసుకోవాలి

తుంకిమెట్లలోని ఆగ్రోస్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో గోపాల్

బొంరాస్‌పేట, జూలై 16 : వానాకాలం పంటల సాగు ప్రారంభమైనందున రైతులకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ ఎరువులు, విత్తన డీలర్లను ఆదేశించారు. మంగళవారం బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్ల, బొంరాస్‌పేటల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమన విత్తనాలను పంపిణీ చేయాలని అన్ని నిబంధనలను పాటించాలని ఆదేశించారు. దుకాణాల్లోని పలు రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం బొంరాస్‌పేటలోని రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో డీఏవో పాల్గొన్నారు. వానాకాలం పంటల సాగులో రైతులు ఎరువుల వాడకంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్ రాథోడ్, ఏవో అనురాధ, ఏఈవోలు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో నీటి సమస్య పరిష్కారం..



కులకచర్ల, జూలై 16: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో మోడల్ స్కూల్‌లో నీటి సమస్య పరిష్కారమైనట్లు కులకచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం స్కూల్‌లో పాఠశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్, గ్రామ పెద్దలతో కలిసి నూతనంగా వేసిన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉందనే విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యేకు విన్నవించగా ఎమ్మెల్యే నిధుల ద్వారా నూతనంగా బోరు వేయించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ హాస్టల్ వార్డెన్ కల్పన, నాయకులు చంద్రభూపాల్‌రెడ్డి, బాలకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, జూలై 16 : కులకచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. దీనికి గాను గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఐదు మొక్కలు పంపిణీ చేసి వాటిని నాటి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొక్కలు మానవ మనుగడకు దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కరీమ్, ఏపీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

బంట్వారం, (కోట్‌పల్లి) జూలై 16 : మండలంలోని ఎన్నారం గ్రామానికి చెందిన మొల్ల రిజ్వానా కు రూ.18 వేల 500లు సీఎం సహాయనిధి చెక్కు వచ్చింది. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ లబ్ధిదారురాలు ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకుడు వెంకట్‌రామ్‌రెడ్డి, మాజీసర్పంచ్ శ్రీనివాస్, నర్సింహా రెడ్డి పాల్గొన్నారు

బటన్లు కుట్టే మిషన్ల కొనుగోలు

మహిళా సమాఖ్య కొనుగోలు చేసిన బటన్లు కుట్టే మిషన్లు

బొంరాస్‌పేట, జూలై 16 : బొంరాస్‌పేట మండల మహిళా సమాఖ్య మహిళలు దుస్తులకు కాజలు, బటన్లు కుట్టే యంత్రాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే యూనిఫాం కుట్టే బాధ్యతను ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. మహిళా సంఘాలు యూనిఫాంను కుట్టిన తరువాత వాటికి కాజలు, బటన్లు కుట్టడానికి పట్టణ ప్రాంతాలకు తీసుకెళ్లి కాజలు, బటన్లు కుట్టించుకుని వచ్చేవారు. దీనివల్ల సమయం వృథా కావడమే కాకుండా అదనంగా ఖర్చయ్యేది. సమయానికి పాఠశాలలకు యూనిఫాంను అందించడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. దీనిని దృష్టిలో ఉంచుకుని మండల మహిళా సమాఖ్య నుంచి రూ.1.68 లక్షలు వెచ్చించి రెండు మిషన్లను కొనుగోలు చేశారు. వీటిని మంగళవారం సమాఖ్య అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి అంబుజ, కోశాధికారి భాగ్యమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సత్యం, సీసీ యాదయ్య పాల్గొన్నారు.

రూ. మూడువేల కోట్లతో .. వికారాబాద్‌లో అభివృద్ధి పనులు

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ
- మర్పల్లిలో టెక్స్‌టైల్ ఏర్పాటుకు కృషి
- పలు కంపెనీల ఏర్పాటుకు చర్యలు

బంట్వారం, జూలై 16: వికారాబాద్ నియోజక వర్గాన్ని రూ. మూడువేల కోట్లతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. మం గళవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో అనేక అభివృద్ధి పనులకు ప్రణాళిక రూ పొందించామని గ్రామగ్రామాన ఎలాంటి పనులు చేయాలనేది గుర్తించామన్నారు. మర్పల్లి, బంట్వారం మండల సరిహద్దులో ఉన్న 12 వందల ఎకరాల్లో కంపెనీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రం అప్పుల మయంలో ఉందని, దీంతో కొన్ని సంక్షేమ పథ కాలకు నిధుల కొరత ఉన్నప్పటికీ దాన్ని అధిగమించి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు.అంతకు ముందు ఆయన రైతు వేదిక వద్ద మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్ గౌడ్, ఏవో సంధ్య, సూపరింటెండెంట్ సుశీల్ కుమార్ షిండే, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు యాదగిరి, శాఖం రాములు, నర్సింహులు, మాజీ ఎంపీపీ ప్రభాకర్, మాజీ సర్పంచులు నర్సింహులు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మర్పల్లి: ఆగస్టు 15 వరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని

మర్పల్లి సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

మార్కెట్ యార్డు లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబార్ చెక్కులను, అలాగే 21 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో టెక్స్‌టైల్స్ ఏర్పాటు చేస్తామని, దీంతో మహి ళలకు ఉపాధి దొరుకుతుందన్నారు. చెరువులు, టూరిజం అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా పట్లూర్ గ్రామానికి చెందిన సురేశ్ యాదవ్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. మండలంలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన అనిల్ నీట్‌లో 570 మార్కులు సాధించడంతో శుభాకాంక్షలు తెలిపి అనిల్ చదువు ఖర్చులు తానే అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్, ర్ నాయకులు రాములు యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పసీయుద్దీన్, బ్లాక్ టూ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు సుభాశ్ యాదవ్, కలీ మోద్దీన్, గణేశ్, సలీం, శివ, రాకేశ్, సాయి, శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన నాయకులు మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిశారు. అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా వాలీబాల్ అసోసి యేషన్ చైర్మన్ జైదుపల్లి హన్మంత్‌రెడ్డి, నాయకులు వీరేందర్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, రఘు రాంరెడ్డి, సుధాకర్ రెడ్డి, మొగులయ్య గౌడ్, సుకుమార్, దస్తగిరి, లక్ష్మణ్ ఉన్నారు.

చిగురిస్తున్న ఆశలు..

బొంరాస్‌పేట, జూలై 16 : గత కొన్ని రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు వానాకాలం పంటలకు జీవం పోశాయి. వానాకాలంలో రైతులు విత్తనాలు వేసి మొలకెత్తిన తరువాత వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో రైతులు సాగు చేసిన పంటల భవిష్యత్తుపై ఆందోళన చెందారు. ఈ దశలో వారం రోజుల నుంచి కురుస్తున్న వానలు అన్నదాతల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి. కురిసిన వర్షాలతో పంటలు కళకళలాడుతున్నాయి. బొంరాస్‌పేట మండలంలో ఈ ఏడాది వానాకాలంలో రైతులు జొన్న 54 ఎకరాలు, కంది 3574, పెసర 2763, మినుములు 25 ఎకరాలు, పత్తి 3050 ఎకరాలు, బెబ్బెర్లు 241 ఎకరాలు, వేరుశనగ 8 ఎకరాలలో సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రైతులు పత్తి పంటను ఎక్కువగా సాగు చేశారు. వర్షపాతం విషయానికి వస్తే మండలంలో జూన్‌లో 76.7 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 177.4 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జూలైలో 61.1 మిల్లీ వర్షం

కళకళలాడుతున్న పెసర పంట

పడాల్సి ఉండగా 16వ తేదీ నాటికి 119 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైనా చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చే వర్షం మాత్రం కురవలేదు.

పోచమ్మ గుడి నిర్మాణానికి విరాళం

దోమ,జులై 16: దోమ మండల పరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామంలోని గ్రామ దేవత పోచమ్మ గుడి పునర్మిణాన్ని చేపట్టిన సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అర్జున్‌రెడ్డి ఫోన్ పే ద్వారా 50 వేల రూపాయల విరాళాన్ని గుడి నిర్మాణ బాధ్యతలు తీసుకున్న వ్యక్తికి పంపించినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవత గుడి నిర్మాణానికి విరాళం అందించడం ఆనందంగా ఉందని అది తన బాధ్యతగా భావించినట్లు పేర్కొన్నారు.

రైతులకు వీడియో కాన్ఫరెన్స్



మరికల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌ను చూస్తున్న రైతులు

కులకచర్ల, జూలై 16 : వర్షాకాలంలో రైతులు పండించే పంటలకు గాను ఎరువుల యాజమాన్య పద్ధతులపై చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వివిధ సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి పంటలో నత్రజని 48కిలోలు, భాస్వరం 20కిలోలు, పోటాష్ 16కిలోలు, ఒక ఎకరానికి తగు దఫాలుగా చల్లుకోవాలని సూచించారు. మొక్క జొన్న పంటలో నత్రజని 80 కిలోలు, భాస్వరం 24కిలోలు, పోటాషియం 20కిలోలు, ఒక ఎకరానికి పలుదఫాలు వేసుకోవాలని తెలిపారు. పత్తి పంటలో నత్రజని 48కిలోలు, భాస్వరం 24కిలోలు, పోటాష్ 24కిలోలు, ఎకరానికి చల్లుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు భావన, విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేయాలి



కులకచర్ల, జూలై 16 : వికారాబాద్ జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ ఎస్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తరించి ఉన్న దాదాపు మూడులక్షల షెడ్యూల్ తెగలు(లంబాడీలు)విద్యాభివృద్ధికి ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల పార్లమెంటు నియోజక వర్గంలో ఏర్పాటు చేయడానికి కేంద్ర గిరిజనశాఖతో మాట్లాడి వికారాబాద్‌లో ఏకలవ్య పాఠశాలను ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

సోమన్‌గుర్తిలో అమ్మమాట అంగన్‌వాడీ బాట ర్యాలీ

పూడూరు, జూలై 16: మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అంగన్‌వాడీ టీచర్ అరుణదేవి పేర్కొన్నారు. సోమవారం పూడూరు మండలం సోమన్‌గుర్తి అంగన్‌వాడీ నంబర్ 1లో అమ్మమాట అంగన్‌వాడీ బాట ర్యాలీ కార్యక్రమం పిల్లలతో తల్లులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని మహిళలు తమ పిల్లలను ఇండ్లవద్ద ఉంచకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. సెంటర్లలో పిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారంతో పాటు అక్షరాలు, ఆటపాటలు నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఆశవర్కర్లు పిల్లల తల్లులు తదితరులు ఉన్నారు.

పసికందు మృతిపై వివరాలు సేకరణ..

వివరాలు సేకరిస్తున్న డీసీహెచ్‌ఎస్ డా.ప్రవీణ్

యాలాల, జూలై16: యాలాల మండలం దేవనూరు గ్రామానికి చెందిన కవితకు బంట్వారం మండలం రేగడిమైలారానికి చెందిన శివకుమార్‌తో వివాహమైంది. కవిత తన తల్లిగారి గ్రామం దేవనూరుకు వచ్చిన సమయంలో ఆదివారం ఉదయం పురిటినొప్పులు రావడంతో ఆమె కుటుంబ సభ్యులు ప్రసవం కోసం తాండూరు పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రికి తీసుకొని వచ్చారు. అదే రోజు రాత్రి జరిగిన ప్రసవంలో శిశువు జన్మించిన కొంచెం సమయం గడచిన తర్వాత మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆలస్యంగా సోమవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పసికందు మృతికి వైద్యుల నిర్లక్ష్యం కారణమని కవిత భర్త ఆరోపిస్తుండడంతో మంగళవారం నిజాలను నిగ్గు తెల్చడం కోసం డీసీహెచ్‌ఎస్ డా.ప్రవీణ్ ఆసుపత్రిని సందర్శించి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.మూర్తి, ఎంసీహెచ్ ఆర్‌ఎంఓ డా. అనిల్, ప్రసవ సమయంలో విధుల్లో ఉన్న డా.మంజులతో కలసి విచారణ చేపట్టారు. పసికందు మృతికి శ్వాస కోస సమస్య కారణమని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సంఘటనపై వివరణ ఇవ్వాలని మెమో జారీ చేసినట్లు తెలిసింది. విచారణ అనంతరం డీసీహెచ్‌ఎస్ డా.ప్రవీణ్ మాట్లాడుతూ... పసికందు మృతి ఘటనలో వైద్యుల నిర్లక్ష్యం లేదని గుర్తించినట్లు తెలిపారు.

అనంతపద్మనాభ స్వామి చిన్న జాతర ప్రారంభం

ధ్వజారోహన కార్యక్రమంలో భాగంగా పూజలు చేస్తున్న అర్చకులు

వికారాబాద్, జూలై 16 : వికారాబాద్ శ్రీ అనంతపద్మనాభస్వామి దేవాలయంలో ఆషాఢ మాసం చిన్న జాతర మంగళవారం ప్రారంభమైంది. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్న జాతరలో భాగంగా ధ్వజారోహణ పూజా కార్యక్రమం ఆలయ ధర్మకర్త పద్మనాభం నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

యువత సన్మార్గంలో నడువాలి: ఎస్ఐ

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ స్రవంతి

బంట్వారం (కోట్‌పల్లి) జూలై 16: మాదక ద్రవ్యాలు, గుట్కా, గంజాయి లాంటి వాటిని యువత అలవాటు చేసుకోరాదని ఎస్ఐ స్రవంతి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామంలో పోలీసు కళాబృందంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవడం వల్ల వారి ఒక్క కుటుంబమే కాదు, సమాజం వినాశనానికి కారణమవుతుందన్నారు. ఇవే కాక, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు, బ్యాంకింగ్ మోసాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST
I, Mangali Venkataiah, S/o. Mangali Laxmaiah, R/o. Kummera, Chevella Mandal, Mudimyal, K.V. Rangareddy, TG. I have lost my Original Sale Deed Document bearing no. 3732/2022, Dt:12/04/2022. Due to my health issue I was travel from himayathsagar to my native place kummera village. If found, please Contact: 8179727199

OLD AGE HOME
★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శివసాగర్ చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

వికారాబాద్, జూలై 16 : శివసాగర్ చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యమైన ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. పూడూరు మండలం గొంగుపల్లి గ్రామానికి చెందిన జంగంగారి చంద్రమ్మ(65) ఈ నెల 13న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి బయలు దేరి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కుమారులు నారాయణ, బందయ్యలు వెతుకుతుండగా మంగళ వారం ఉదయం 10.30 గంటలకు వికారాబాద్ పరిధిలోని శివారెడ్డి పేట్ చెరువులో చంద్రమ్మ మృతదేహం లభించింది. చెరువు నీటి పైన ఒక ఆడ మనిషి బోర్లా పడి ఉన్నదని గమనించి స్థానికులతో ఒడ్డుకు తీసుకొచ్చారు. చీరను, మెడ పట్టిని బట్టి తల్లి చంద్రమ్మగా గుర్తించారు. శివసాగర్ చెరువులో కాళ్లు చేతులు కడుక్కుంటూ ఉండగా ప్రమాదవ శాత్తు చెరువులో పడి చనిపోయి ఉంటుందన్నారు. తన తల్లిమృతి పై ఎలాంటి అను మానం లేదని నారాయణ పోలీసులకు తెలిపారు.

పుట్టపహాడ్‌లో డెంగ్యూ

• జ్వర సర్వే • వైద్య శిబిరం ఏర్పాటు

కులకచర్ల, జూలై 16: మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో ఒకరికి డెంగ్యూ పాజిటీవ్ అని తేలిందని సీహెచ్‌వో చంద్రప్రకాశ్, సబ్‌యూనిట్ అధి కారి వెంకన్న తెలిపారు. దీంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలి పారు. వైద్య బృందం ఇంటింటికి తిరిగి జ్వర పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారుగా 120 ఇండ్లల్లో జ్వర పరీక్షలు నిర్వహించామన్నారు. కాగా బాధితురాలకి మందులు పంపిణీ చేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించామన్నారు. కాగా ఆ కుటుంబం ఉన్న చోట నీరు నిల్వ ఉందని గుం తలలో నీరు, మురుగునీరు ఉందని తొలగించాలని పంచాయతీకి తెలియ జేసినట్లు తెలిపారు. జ్వర సర్వేలు చేసి రక్తనమూనాలు తీసుకున్నట్లు వివరిం చారు. దోమ లార్వాను నిర్మూలించుటకు టీమోపాస్ ద్రావణం మురికి గుంటలో పిచికారి చేస్తూ దోమలు పెట్టిన గుడ్లమీద పైరిత్రం మందును స్ప్రే చేసినట్లు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవ గాహన కల్పించినట్లు తెలిపారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పనులు నిర్వహించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు డాక్టర్ మనీశ్, సూపర్ వైజర్లు విజ యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య, ఏఎన్‌ఎం వెంకటమ్మ, ఆశా కార్యకర్తలు రాధిక, రాజేశ్వరి, మంజూల పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ ఇబ్రహీంపట్నం/మహేశ్వరం } 80966 77668 : 80966 77962